క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన డీఎంసీ



కాచిగూడ: జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మారుతి దివాకర్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కలిశారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

కార్మిక కమిషనర్ కార్యాలయంలో బోనాలు

చిక్కడపల్లి : కార్మిక కమిషనర్ కార్యాలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం రాష్ట్ర కార్మికశాఖ అధికారులు, ఉద్యోగులు సుధీర్, సత్యనారాయణ ఆధ్వర్యంలో నల్లపోచమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్మికశాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్, డీసీఎల్ నీలమ్మ పాల్గొన్నారు.

క్రాస్‌బో షూటింగ్‌లో స్వర్ణం



గోల్డ్‌మెడల్‌తో సాయి హన్సిక

కాచిగూడ: ఈనెల 19,20 తేదీల్లో ఇండియన్ క్రాస్‌బో షూటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగ్రాలో జరిగిన 4వ 'నేషనల్ క్రాస్ బో' షూటింగ్ చాంపియన్‌షిప్– 2023లో నగరానికి చెందిన సాయి హన్సిక చక్రట్ స్వర్ణ పతకం సాధించారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా, ఉత్తరప్రదేశ్, అస్సాం, తమిళనాడు, కేరళ, రాష్ట్రాలు పాల్గొనగా.. తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. తెలంగాణకు 7 స్వర్ణాలు, 4 రజత పతకాలు, 5 కాంస్య పతకాలు దక్కాయి. ఇండియన్ క్రాస్‌బో షూటింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజత్‌విజ్, వైస్ ప్రెసిడెంట్ హినవిజ్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ క్రాస్ బో షూటింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు లక్ష్మీచైతన్య, ప్రధానకార్యదర్శి మాధురి తదితరులు ఆమెను అభినందించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి



కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ప్రదీప్‌రావు

కాచిగూడ: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్ అన్నారు. కాచిగూడ ఏసీపీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ప్రముఖ సంఘసేవకులు ప్రదీప్‌రావు నేతృత్వంలో పలువురు ఏసీపీని కలిసి అభినందనలు తెలియజేశారు. జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేతలు దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, శేషు తదితరులు ఏసీపీని కలిసి పూలబోకే అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు, అడ్మిన్ ఎస్సై హెచ్.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి పేరిట మోసం

రూ.99,500 కాజేసిన వైనం

నల్లకుంట: విదేశాల్లో ఉన్న స్నేహితుడి వాయిస్‌తో ఓ బిజినెస్ గ్రూప్‌లో ఓ వ్యక్తికి వాట్సప్ కాల్ చేసి బురిడీ కొట్టించి రూ.99, 500 కాజేసిన సైబర్ కేటుగాడిపై నల్లకుంట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం...ఐటీ కన్సల్టెంట్ కోమటిరెడ్డి అమరేందర్ రెడ్డి విద్యానగర్ అచ్యుతరెడ్డి మార్గ్‌లో నివసిస్తున్నాడు. ఈ నెల 19న యూఎస్‌లో ఉండే స్నేహితుడు రఘునాథ్‌రెడ్డి పేరుతో 17736796378 నంబర్ నుంచి వాట్సప్ కాల్ వచ్చింది. అనంతరం అవతలి వ్యక్తి సిగ్నల్ సమస్య ఉందని చాటింగ్ చేశాడు. రూ.99,500 అవసరం ఉన్నాయని మెసేజ్ పెట్టగా నిజమేనని నమ్మిన అతడు తన ఐసీఐసీఐ బ్యాంక్ అకౌంట్ నుంచి అవతలి వ్యక్తి పంపించిన అకౌంట్ నంబర్‌కు డబ్బు పంపించాడు. మరిన్ని డబ్బులు పంపించాలని మెస్సేజ్ పంపించడంతో అనుమానం రాగా.. వెంటనే తన స్నేహితుడికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో రఘునాథ్ రెడ్డి తాను ఫోన్ చేయలేదని, డబ్బులు అడగలేదని చెప్పాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు శుక్రవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కమలానగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



స్థానిక సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ అమృత

అంబర్‌పేట: వర్షాల పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. శుక్రవారం గోల్నాక డివిజన్‌లోని కమలానగర్ లంక బస్తీలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెట్లకొమ్మలు, పాత నిర్మాణాలు, విద్యుత్ స్తంభాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు. ఎలాంటి ఇబ్బందులున్నా.. తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు. అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అధికారులకు సమాచారం ఇవ్వకుండా మ్యాన్‌హోల్స్ తెరవద్దు

నల్లకుంట: గత కొద్ది రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు చెట్ల కొమ్మలు విరిగి పడుతుండటంతో చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. నల్లకుంట డివిజన్‌పరిధిలో చాలాచోట్ల చెట్లకొమ్మలు విరిగిపడుతుండటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

- కొన్ని ప్రాంతాల్లో విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తు చర్యలో భాగంగా విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- స్థానిక సమస్యలు తెలుసుకున్న కార్పొరేటర్ అమృత గురువారం రాత్రి వర్షంలోనే జీహెచ్‌ఎంసీ ఎమర్జెన్సీ స్క్వాడ్, ఇతర సిబ్బందితో కలిసి ఆయా బస్తీలు, కాలనీలలో పర్యటించారు. విరిగిపడిన చెట్ల కొమ్మలు తొలగింపచేసి విద్యుత్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతేనే బయటకు రావాలన్నారు. వర్షాల కారణంగా సమస్యలు తలెత్తితే వెంటనే సమాచారం అందించాలని ప్రజలను కోరారు.
- వరదల సమయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందికి సమాచారమివ్వకుండా ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో మ్యాన్‌హోల్స్ మూతలను తెరవొద్దని సూచించారు.
- ఇష్టానుసారంగా మ్యాన్‌హోల్స్ తెరిచి ఉంచితే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడే ప్రమాదం ఉందన్నారు.
- వర్షాలు కురుస్తున్న సమయంలో చిన్నపిల్లలు విద్యుత్ స్తంభాలు ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా బస్తీలోకి వర్షపునీరు రావడంతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ పరిస్థితులను పరిశీలించి స్థానికులకు ధైర్యం చెప్పారు. రూ.69 కోట్ల వ్యయంతో నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణం దాదాపు పూర్తి అయిందని తెలిపారు. ఈ నిర్మాణం వల్ల నాలా వెంట నివసించే వారికి ప్రమాదం చాలా వరకు తగ్గిందని తెలిపారు. బీఆర్‌ఎస్ నేత ముఠా జైసింహ, గాంధీనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, నాయకులు నరేష్, శ్రీకాంత్, ఆకుల శ్రీనివాస్, సరస్వతి, రాజ్‌కుమార్, ఇస్తారి, విఠల్, హనుమంతు, సుధాకర్, శ్రీనివాస్, ముఠా రామరాజ్, సుజాత తదితరులున్నారు.

బాధితులను ఆదుకుంటాం..

కవాడిగూడ: భారీగా వర్షాలతో నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. కవాడిగూడ లీఓని ఎరుకల బస్తీలో కూలిన ఇంటి గోడను శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించి పరిశీలించారు. ఇంటి యజమాని సాయిని అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. నష్టపరిహారం అందించేందుకు అధికారులతో చర్చించి తనవంతుగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ముఠా జైసింహ, శ్యామ్‌యాదవ్, శ్రీహరి, శ్రీనివాస్, దుర్గస్వామి, ప్రవీణ్, రవియాదవ్, రమణ తదితరులు పాల్గొన్నారు.



కూలిన ఇంటిగోడను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కిషన్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



అంబర్‌పేటలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి

కాచిగూడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గౌతంరావు మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కిషన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్, ఎ.సూర్యప్రకాష్‌సింగ్, కేశబోయిన శ్రీధర్, వినోద్‌యాదవ్, నందకిషోర్‌యాదవ్, భీమ్‌రాజ్, సుభాష్‌పటేల్, ఆర్.సంతోష్, వాసు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టే ముందు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అంబర్‌పేటలోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం అంబర్‌పేటలోని పూలే చౌరస్తాలో నివాళులర్పించారు. బీజేపీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గౌతమ్‌రావు, గద్వాల జిల్లా ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు జైలు

కాచిగూడ: వాహనాన్ని అతివేగం, నిర్లక్ష్యంగా నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు కోర్టు 6 నెలల సాధారణ జైలుశిక్ష, రూ.5వేల జరిమానాను విధించిందని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పబ్బ సందీప్ తెలిపారు. 2015 నవంబర్ 15న సయ్యద్ బిన్‌అలీ (38) ఆర్‌జీ కేడియా కాలేజ్ వద్ద రోడ్డు దాటుతుండగా.. నీటి ట్యాంకర్ డ్రైవర్ మహ్మద్ రఫీక్ (35) ట్రాఫిక్ సిగ్నల్‌ను గమనించకుండా అతివేగంగా వాహనాన్ని నడిపి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన అతడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన నాల్గో అదనపు చీఫ్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ నిందితుడికి సెక్షన్ 304(ఏ) కింద ఆరు నెలల సాధారణ జైలుశిక్ష, రూ.5వేల జరిమానాను విధిస్తూ తీర్పును వెలువరించారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: నియోజకవర్గంలో ఆరు డివిజన్‌లలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల వ్యవస్థల ఆధునీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శుక్రవారం రాంనగర్ డివిజన్‌లోని దాయరా మార్కెట్ చౌరస్తా నుంచి హరినగర్ చౌరస్తా వరకు రూ.14 లక్షలతో తాగునీటి పైపులైన్ పనులను కార్పొరేటర్ కె.రవిచారితో కలిసి ప్రారంభించారు. పైపులైన్ ఏర్పాటుకు రూ. 45 లక్షల నిధులను మంజూరు చేయించామన్నారు. జలమండలి మేనేజర్ సాయిరాం, ముఠా జైసింహ, రాంనగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రావులపాటి మోజెస్, దామోదరరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఎర్రం శేఖర్, ముదిగొండ మురళీ, అమర్, ప్రవీణ్, రమేష్‌యాదవ్, బీజేవైఎం నాయకులు గడ్డం నవీన్ తదితరులున్నారు.

ముషీరాబాద్‌లో...

- రూ.3.50 లక్షలతో చేపట్టిన తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, జలమండలి డీజీఎం మోహన్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నేతలు సోమన్, నర్సింగ్‌ప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, బీజేపీ నేతలు బద్రినారాయణ, కంచికుమార్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, బల్లా ప్రశాంత్, రాజు, క్రాంతి, ఆలయ కమిటీల చైర్మన్‌లు శ్రీధర్‌చారి, ఎయిర్‌టెల్ రాజు తదితరులున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

చిక్కడపల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కుమార్, ఎస్సై అభిలాష్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ క్రాస్‌రోడ్డు మెట్రోస్టేషన్ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై 55-60 ఏళ్లున్న వ్యక్తి మృతదేహం పడిఉన్నట్లు సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నాలా విస్తరణ పనులను పూర్తి చేయాలి



నాలా పనులను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, ఎమ్మెల్యే

ముషీరాబాద్: నియోజకవర్గం పద్మకాలనీలో నత్తనడకన సాగుతున్న నాలా విస్తరణ, ప్రహరీ గోడ నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజలకు వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చూడాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఎస్ఎన్‌డీపీ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వచ్చే వరదలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నాలా పరివాహక ప్రాంత ప్రజలకు ఆయన సూచించారు. పద్మాకాలనీలోని వరద నీటికాలువ పనులను శుక్రవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కమిషనర్ సందర్శించారు. నాలా నిర్మాణ పనుల్లో జాప్యంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, సర్కిల్ డీఎంసీ తిప్పర్తి యాదయ్య, ఈఈ శ్రీనివాస్, డీఈ సన్నీ, ఏఎంఓహెచ్ మైత్రేయి, ముఠా జైసింహ, శ్యామ్‌సుందర్, మాధవ్, సయ్యద్ అస్లాం, నేత శ్రీనివాస్ తదితరులున్నారు.

హనుమంతు భావాలను అందుకున్న సుద్దాల అశోక్‌తేజ

చిక్కడపల్లి: సుద్దాల అశోక్‌తేజ తెలంగాణ సాయుధ పోరాట కవి యోధుడు సుద్దాల హనుమంతు వారసుడిగా ఆయన భావాలను అందిపుచ్చుకున్నారని సీబీఐ విశ్రాంత ఉన్నతాధికారి వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. త్యాగరాయగానసభలో శుక్రవారం రాత్రి శారద మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రఖ్యాత గాయకుడు డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జీవిత సాఫల్య పురస్కారం ప్రముఖ కవి సుద్దాల అశోక్‌తేజకు బహూకరించారు. సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, నిర్మాత రామసత్యనారాయణ, దైవజ్ఞశర్మ, తనికెళ్ల రామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

కమేళాలో సమస్యలు పరిష్కరించండి



జీహెచ్‌ఎంసీ వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న మొండెదార్లు

కాచిగూడ: గోల్నాక డివిజన్ కమేళాలో మొండెదార్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి కనీస వసతులు కల్పించాలని అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్.రమేష్, ప్రధాన కార్యదర్శి ఎల్.ద్వారకానాథ్ విన్నవించారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సద్గుణదేవిని కలిసి ఈ మేరకు సమస్యలను వివరించారు. ఆమె కమేళాలో పర్యటించి మొండెదార్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య, విద్యుత్ సమస్య, శానిటేషన్ సమస్య తీవ్రంగా ఉందని, చనిపోయిన పశువుల వ్యర్థాలను వేసేందుకు స్థలం చూపించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యర్థాలను ఇష్టానుసారంగా పారవేయకూడదని సూచించారు. జీహెచ్‌ఎంసీ సూచించిన కవర్లలోనే వ్యర్థాలను వేసి వారి వాహనం ద్వారానే తరలించాలని సూచించారు. న్యాయమైన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

కూలిన గోడలు .. ఒరిగిన చెట్లు



ముషీరాబాద్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాంనగర్ రామాలయం వీధిలో ఓ ఇంటి గోడలు కూలాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. పాత ఇళ్లల్లో ఎవరూ ఉండకూడదని జీహెచ్‌ఎంసీ సిబ్బంది పురాతన ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేశారు.



ఒమెగా స్కూల్ గల్లీలో డీఆర్‌ఎఫ్ సిబ్బంది

రాంనగర్ గుండు వద్ద...

- రాంనగర్ గుండు సమీపంలోని ఒమెగా స్కూల్ వీధిలో కురుస్తున్న వర్షాలకు చెట్టు విరిగి అడ్డంకిగా మారింది. స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా.. డీఆర్‌ఎఫ్ సిబ్బంది చెట్టును తొలగించారు.

'ఆగస్టు 8న చలో ఢిల్లీ'

బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలో కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో బీసీబిల్లు ప్రవేశ పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసి రూ.2లక్షల కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పథకాన్ని ప్రకటించాలన్నారు. బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు 50 సీట్లు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. అగస్టు 8 న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో వేలాది మందితో 'చలో ఢిల్లీ' పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యం, రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, అనంతయ్య, సురేష్, జలపల్లి కిరణ్, పండరినాథ్, మురళి తదితరులు పాల్గొన్నారు

అవార్డు ప్రదానం



కాచిగూడ: ఆషాఢమాసం బోనాల సందర్భంగా ఉజ్వల సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్‌హాల్‌లో నిర్వహించిన 'బోనాల జాతర' అవార్డులలో గోల్నాకకు చెందిన సాయి (బోనం) బెస్ట్ బోనం అవార్డును తెలంగాణ రాష్ట్ర శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా సాయి (బోనం) మాట్లాడుతూ.. తెలంగాణ బోనాల ఉత్సవాల సందర్భంగా తాను అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆషాఢమాస బోనాలను గత కొన్నేళ్లుగా వైభవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేశారని తెలిపారు. అవార్డుతో తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు.

సినారె గీత విభావరి

చిక్కడపల్లి: కల్పన కళానికేతన్ ఆధ్వర్యంలో సినారె జయంతి సందర్భంగా తెలుగు, హిందీ సినీ గీతాల ఆలాపన త్యాగరాయగానసభలో నిర్వహించారు. శుక్రవారం దొంతి జంగయ్యగౌడ్, ఎం.గోవర్ధన్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పలువురు గాయనీగాయకులు సినారె రచించిన గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా నాటక కళారంగంలో విశేషకృషి చేసిన డి.నాగేందర్‌ను సన్మానించారు. గాయకులు గడ్డం లాలయ్యచౌదరి, జస్పాల్‌సింగ్, లంకా నాగేశ్వరప్రసాద్, నాగభూషణం, విజయకుమార్, సావిత్రిప్రభాకర్, మహాలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



నాగేందర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

మణిపూర్‌లో హింసకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలి..

కవాడిగూడ: మణిపూర్‌లో కుకీ ఆదివాసీ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, హత్యలను అరికట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాల నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మణిపూర్ హింసకు వ్యతిరేకంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం మహిళా సంఘాల నేతలు, నవభారత్ సదాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మహిళా సంఘాల నేతలు, మణిపూర్ రాష్ట్రానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కవాడిగూడ: కేంద్ర ప్రభుత్వ పరిపాలన ప్రమాదకరంగా మారిందని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన సామూహిక అత్యాచారం దీనికి నిదర్శనమని విమర్శించారు. శుక్రవారం దోమలగూడలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మణిపూర్ సీఎం బీరేన్‌సింగ్‌ను బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అత్యాచారానికి గురైన బాధితుల కుటుంబాలకు న్యాయం చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు శోభన్ బుక్యా, సోలోమన్‌రాజు, నేతలు రాకేష్‌సింగ్, ఆపసాబేగం, మల్లేష్, ఆప్ యూత్ వింగ్ అధ్యక్షుడు సర్దార్ రణదీర్‌సింగ్ రాణా తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఆధ్వర్యంలో..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ.. మణిపూర్ బీజేపీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య పార్కు వద్ద సామాజిక మహిళా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మణిపూర్ రాష్ట్రంలో గిరిజన మహిళలపై జరిగిన దాడిని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, డీవైఎఫ్ఐ అధ్యక్షులు కోట రమేష్, వివిధ సంఘాల నాయకులు వెంకటేష్, రాములు, రమా, బుర్రి ప్రసాద్, రమేష్, పద్మ, ఎండీ జావిద్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య పార్కు వద్ద నిరసన చేపడుతున్న దృశ్యం

మానవ హక్కుల ఉల్లంఘనను అదుపు చేయాలి

కాచిగూడ: మణిపూర్‌లో మానవహక్కుల ఉల్లంఘనను అదుపు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. కుకి, నాగ ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండ, నగ్న ఊరేగింపులు, రేప్‌లపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గత మూడు నెలలుగా జాతుల హింస జరుగుతున్నా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. పార్టీ నేతలు బీరం సతీష్‌కుమార్, సుబ్బారావు, మద్దెల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్ చౌరస్తాలో నిరసన చేస్తున్న పీవైఎల్ నాయకులు

ముషీరాబాద్: మణిపూర్‌లో కుకీ గిరిజన తెగకు చెందిన ముగ్గురు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించి సామూహిక అత్యాచారానికి పాల్పడిన అల్లరి మూకలను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్), తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. మణిపూర్‌లో హింసాఖాండ ప్రారంభమై 79 రోజుల తర్వాత ప్రధాని స్పందించడం సిగ్గుచేటని విమర్శించారు. హింసను ఆపకుండా ఇంటర్నెట్ బంద్ చేసి అల్లర్లు సృష్టిస్తున్నారని తక్షణమే శాంతిని నెలకొల్పి అల్లరి మూకలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ప్రదీప్, తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కోలా నల్లన్న, రాందాస్, నాయకులు రవికుమార్, భూషణవేణి కృష్ణ, రాజు, వెంకటేష్, శ్రీనివాస్, మల్లేష్, మహాదేవ్, ఆంజనేయులు, నాగేష్, అజయ్ పాల్గొన్నారు.